క్లుప్తంగా

ఎమ్మెల్యే పొన్నాడకు అభినందనలు



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను అభినందిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా నియమితులైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి బృంద సభ్యులు మంగళవారం వెళ్లి ఆయనను సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు దార్ల పెదబాబు, కట్టోజు సన్యాయ్యదాసు, తాళాబత్తుల లక్ష్మణరావు, భరణికాన బాబు, వీర్ని శేషు, దొంకాడ సాయి తదితరులున్నారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన ఎస్‌ఐ హరీష్



మంత్రి విశ్వరూప్‌కు పూలకుండీని అందజేస్తున్న ఎస్‌ఐ హరీష్‌కుమార్

అల్లవరం: అల్లవరం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్‌కు ఎస్‌ఐ హరీష్‌కుమార్ పూలకుండీ అందజేశారు.

ముక్తిధామ భవనం, గ్రంథాలయం ప్రారంభం

అమలాపురం టౌన్: అమలాపురం ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామనగరువు శివారు మెండివారిపేటలో నిర్మితమైన ముక్తి ధామం ప్రాంగణంలోని భవనం, గ్రంథాలయం మంగళవారం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని యర్రమిల్లి వారి వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ 38వ వార్షికోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాలపై ముద్రించిన పుస్తకం, భారతీయ విజ్ఞాన వైభవం రామాయణ ప్రశ్నావళి పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ట్రస్ట్ రూపొందించిన «భావోద్వేగం» లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ కుమార్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పాలగుమ్మి వినాయక్, యెండూరి సీత, సినీ నటుడు గుర్రం రామకృష్ణ, యర్రమిల్లి పాండురంగారావు, పేరి లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు వేంకటేశ్వరస్వామి ఫొటోను అందజేస్తున్న అల్లవరం పార్టీ నేతలు

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను అమలాపురంలోని ఆయన నివాసంలో అల్లవరం గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో గోసంగి వెంకటేశ్వరరావు, సాపే వెంకటేశ్వరరావు, శెట్టిబత్తుల వెంకటేశ్వరరావు, పాలమూరి సత్యనారాయణ, బొంతు రవి, విప్పర్తి రామకృష్ణ, బొంతు రామకృష్ణ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్‌డీవో



చల్లపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్‌డీవో వసంతరాయుడు

ఉప్పలగుప్తం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అమలాపురం ఆర్‌డీవో ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని చల్లపల్లి, సరిపల్లి, విలసవిల్లి గ్రామాల్లో పర్యటించి ఓటరు జాబితాలను పరిశీలించారు. ఎస్.పల్లిపాలెం పోలింగ్ స్టేషన్‌తో పాటు నక్కా రామేశ్వరంలో ఎంపీయూపీ స్కూల్‌లో కొత్తగా ఏర్పాటుచేస్తున్న పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఆర్‌ఐ వెంకటరమణ తదితరులున్నారు.

కాలువలో పూడికతీత పనుల పూర్తి

- రంగరాజుకోడు మెయిన్ డ్రెయిన్‌లో శరవేగంగా సాగిన పనులు
- 15 వేల ఎకరాల ఆయకట్టుకు లబ్ధితో రైతుల హర్షం



రంగరాజు కోడు మీడియం డ్రెయిన్‌లో ప్రొక్లెయిన్లతో చేపట్టిన పూడికతీత పనులు

ఉప్పలగుప్తం: ఖరీఫ్ సాగులో ముంపునకు గురవుతున్న వ్యవసాయ క్షేత్రాలకు రంగరాజుకోడు మీడియం డ్రెయిన్ తవ్వకాలతో విముక్తి లభించింది. 2011 సంవత్సరంలో రైతులకు నీటి దిగుబడికి ఆటంకం లేకుండా రంగరాజుకోడు మీడియం డ్రెయిన్ పూడికతీత పనులు జరిగాయి. అనంతరం మళ్లీ పూడికలు పెరిగి మేటలు వేయటంతో నీటి దిగుబడికి ఆటంకం ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూడికలు తీయించాలని రైతులంతా నాయకులు, అధికారులు వద్ద తమ గోడు వెల్లబోసుకున్న కనీసం కన్నెత్తి చూసిన వారే లేరు. ఇదే విషయంపై స్థానికంగా ఉన్న రైతులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి.

నాలుగు మండలాల రైతులకు మేలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి విశ్వరూప్ చొరవతో మెదటి దఫాగా రూ.70 లక్షల సీఎస్ఆర్ నిధులను కేటాయించి చెయ్యేరు అగ్రహారం నుంచి నంగవరం వరకూ 4.2 కిలోమీటర్ల మేర తవ్వకాలు జరిపారు. రెండో దఫాగా రూ.94 లక్షల సీఎస్ఆర్ నిధులతో నంగవరం నుంచి కూనవరం మేజర్ డ్రెయిన్ వరకూ 6.2 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టారు. డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి తవ్వకాలు జరిపారు. అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లో సుమారుగా 15 వేల ఎకరాల ఆయకట్టుకు ముంపు నుంచి విముక్తి కలిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూడికతీత పనులతో రంగరాజుకోడు మీడియం డ్రెయిన్‌కు అనుసంధానమైన రెవెన్యూ డ్రెయిన్‌లతో చేలల్లో ఉన్న నీటి దిగుబడి బాగుందని ఇక నుంచి ధైర్యంగా ఖరీఫ్ సాగు చేసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.

రైతులు పూర్తి సహకారం అందించారు



డ్రెయిన్ తవ్వకాల్లో ఆక్రమణలు తొలగించే విషయంలో రైతులు పూర్తి సహకారం అందించారు. 10.4 కిలోమీటర్లు ఉన్న రంగరాజు కోడు మీడియం, మైనర్ డ్రెయిన్‌ల్లో తవ్వకాలతో 4 మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు ముంపు సమస్య తీరుతుంది. పూడికతీత పనులు వంద శాతం పూర్తయాయి. నీటి ప్రవాహం గతం కంటే వేగంగా కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి దిగుతుంది.

– ఎంవీవీ కిషోర్, డ్రెయిన్స్ డీఈ, అమలాపురం

చాలా సంతోషంగా ఉంది



రంగరాజు డ్రెయిన్‌లో మేటలు వేయడంతో చేలల్లో నీరు దిగక గత కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వ హయాంలో అధికారులు, నాయకుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా ఉపయోగం లేకపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూడికతీత పనులతో మా సమస్యకు విముక్తి కలిగించారు. మాకు చాలా సంతోషంగా ఉంది.

– గుర్రింక తమ్మేశ్వరరావు, రైతు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

ఆక్రమణలు పూర్తిగా తొలగించాలి



రంగరాజుకోడు పూడికతీత పనులు జోరుగా సాగిస్తున్నారు. రైతులంతా ఏకపక్షంగా వ్యవహరించి డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడానికి అధికారులకు సహకరించాం. ఇప్పటికీ అక్కడక్కడా ఉన్న ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగిస్తే అందరికీ న్యాయం జరుగుతుంది. ఈ పనులతో ముంపు సమస్య తీరింది.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

ఆర్‌ఏఓ మునిస్వామికి మహిళల వినతి



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

యానాం: యానాం శివారు దొమ్మేటిపేటలో ఏర్పాటుచేసిన రాయల్ రీక్రియేషన్ క్లబ్ మూసివేయించాలని చూడడం తగదని పలువురు మహిళలు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం దొమ్మేటిపేట, సీతారామనగర్, దరియాలతిప్ప, సావిత్రినగర్ తదితర గ్రామాలకు చెందిన మహిళలు ఆర్‌ఏఓ ఆఫీసు వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. యానాంలో ఫ్యాక్టరీల మూసివేతతో రీక్రియేషన్ సొసైటీలో పనులు చేసుకుంటూ బతుకుతున్నామని, తమ ఉపాధిని దెబ్బతీయొద్దంటూ నాగమణి, సీతమ్మ, సూర్యకాంతం తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను ఆకళింపు చేసుకోవాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఈఓ వెంకటేశ్వర్లు

ముమ్మిడివరం: ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని పంట కోత ప్రయోగాలు నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి పి.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మండలాల క్షేత్ర స్థాయి సిబ్బందికి, సహాయ వ్యవసాయ సంచాలకులకు ఎంవీ రాజారావు అధ్యక్షతన శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంట కోత ప్రయోగం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. పంట కోతలు ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారు. డీఎస్‌ఓ ఎ.ప్రభుదాస్, డి.ప్రభాకరరావు, బాలశ్రీనివాస్, ఏఓలు ప్రశాంతకుమార్, ఎం.వాణి, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంగీత విద్వాంసుడు వెంకట్రావు మృతి

తాళ్లరేవు: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు, సంగీత విద్వాంసుడు పేరూరు వీర వెంకట సత్యనారాయణ(కోరంగి వెంకట్రావు) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి నాయీ బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వెదురుపావులూరి నాని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో విశేష సేవలు అందించిన వారికి ఇచ్చే 'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'awards.gov.in' వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులను పూర్తిచేసి సెప్టెంబర్ 30లోగా సమర్పించాలన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజ వికాసం



మహిళా వాకర్స్, ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు సుజాతను సత్కరిస్తున్న వాకర్స్ జిల్లా గవర్నర్ భాస్కరరావు, బేబీ మీనాక్షి తదితరులు

అమలాపురం టౌన్: మహిళల ఆరోగ్యంతోనే సమాజ వికాసం సాకారమవుతుందని వాకర్స్ జిల్లా గవర్నర్ ఎం.భాస్కరరావు అన్నారు. అమలాపురం సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సభకు ప్రత్యేక అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షురాలు పినిపే బేబీ మీనాక్షి పాల్గొని ప్రసంగించారు. మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన జల్లి సుజాత, కార్యవర్గ ప్రతినిధులచే ముఖ్య అతిథులు ప్రమాణ స్వీకారం చేయించి సత్కరించారు. వాకర్స్ జిల్లా డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, తేతల సత్యనారాయణరెడ్డి, మట్టపర్తి నాగేంద్ర, కల్వకొలను తాతాజీ, డాక్టర్ రుద్రరాజు సాయి శిల్ప తదితరులు ప్రసంగించారు.

పారిశుధ్య నిర్వహణపై కౌన్సిలర్ల అసంతృప్తి

వాడి వేడిగా ముమ్మిడివరం కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: నగర పంచాయతీలో శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందంటూ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో మంగళవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, అడబాల సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ నగర పంచాయతీలో గత నాలుగు నెలలుగా శానిటేషన్ నిర్వహించడం లేదని, ఎక్కడా బ్లీచింగ్ చల్లడం లేదంటూ మండిపడ్డారు. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తొలగించే కార్మికులు ఇళ్ల యజమానుల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని శానిటేషన్ ఏఈ సత్యనారాయణను ఆదేశించారు. కుళాయిల ద్వారా వస్తున్న నీరు కలుషితమవుతుందని 6వ వార్డు కౌన్సిలర్ దివి మహాలక్ష్మి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. 13వ వార్డు పెయ్యల వారిపేటలో మంచి నీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా వార్డుల్లో మంచినీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని చైర్మన్ ప్రవీణ్ ఆదేశించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ రెడ్డి హేమ సుందరి, కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైల్వే కౌంటర్‌కు ఉచితంగా 2 షాపులు

మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంపై హర్షాతిరేకాలు



సర్క్యులర్ బజార్‌లో ఇటీవల రైల్వే శాఖ ఎత్తివేసిన రిజర్వేషన్ కౌంటర్ షాపులు

అమలాపురం టౌన్: స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్(సర్క్యులర్ బజార్)లో గత 23 ఏళ్లుగా నడుస్తున్న రిజర్వేషన్ కౌంటర్‌ను నిర్వహణ భారంతో రైల్వే శాఖ ఇటీవలే ఎత్తివేసింది. ఈ కౌంటర్‌ను సమీపంలోని అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయానికి తరలించిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితర ప్రజాప్రతినిధులు కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయి రైలు అందుబాటులోకి వచ్చే వరకూ ఈ షాపులను రైల్వే శాఖకు అద్దె ప్రాతిపదికన కాకుండా ఉచితంగా ఇవ్వాలని మున్సిపాలిటీపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మున్సిపాలిటీ రైల్వే శాఖకు ఉచితంగా రెండు షాపులను కేటాయించేందుకు అంగీకరించింది. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాలోని 10వ అంశంగా చేర్చి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్రతో పాటు ప్రతిపక్ష కౌన్సిలర్లు సైతం కౌన్సిల్ హాలులో బల్లలు చరుస్తూ ఆ అంశానికి మద్దతు ఇచ్చి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. కౌన్సిల్ తీర్మానంపై కోనసీమ రైల్వే సాధన సమితి స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం సంతోషం వెలిబుచ్చారు.

యానాం అభివృద్ధే ధ్యేయంగా నిరంతర కృషి



గోపాల్‌నగర్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: రాజకీయపరమైన అడ్డంకులను దాటుకుంటూ యానాం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రూ.14.25 లక్షల పీడబ్ల్యూడీ నిధులతో స్థానిక గోపాల్‌నగర్ పరిధిలోని ఫ్రెంచి కెనాల్ గోడ నిర్మాణంతో పాటు రహదారి నిర్మాణ పనులకు, కనకాలపేటలో రూ.11 లక్షలతో ఇండోర్ స్టేడియం పనులకు, ఎమ్మెల్యే లాడ్ నిధులు రూ.3.50 లక్షలతో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ గ్రౌండ్ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక హైస్కూల్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి రెయిన్ కోట్లు అందించారు. విద్యార్థులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఆర్‌ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ వీరసెల్వం, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాష్ పాల్గొన్నారు.

యానాం టు విజయవాడ ఆర్టీసీ సర్వీసు

యానాం: యానాం పరిసర ప్రాంత ప్రయాణికులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం ఈ నెల 30వ తేదీ బుధవారం నుంచి యానాం నుంచి విజయవాడకు అల్ట్రా డీలక్స్ బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాంలో ఉదయం 5.50 గంటలకు బయలుదేరి అమలాపురం, రాజోలు, నరసాపురం, బంటుమిల్లి, మచిలీపట్నం మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. అదేవిధంగా మరో బస్సు విజయవాడ నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు యానాం చేరుకుంటుందన్నారు.

అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావుకు సత్కారం



అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావును సత్కరిస్తున్న సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: న్యూఢిల్లీ అడిషనల్ డీజీపీగా పనిచేస్తున్న ఎస్.శ్రీధర్‌రావును డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ మండలం జనుపల్లెలో మంగళవారం ఘనంగా సత్కరించారు. అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావు తన స్వగ్రామం జనుపల్లెకు వచ్చిన సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, కార్యదర్శి తెన్నేటి రాజబాబు ఆధ్వర్యంలో జిల్లా సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడికి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు పీజే బెల్లీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేయాలి



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు



తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు వేషధారణల్లో అలరించిన చిన్నారులు



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, దాట్ల తదితరులు

అల్లవరం: తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ కృష్ణమోహన్, విస్తరణాధికారి లక్ష్మణరావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలో సాహితీవేత్త, గ్రంథ రచయిత పోచినపెద్ది కామ సత్యనారాయణను స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, పచ్చిగోళ్ల రాజా, కూచిమంచి కృష్ణ, ఎంఎస్ఎన్ రాజు తదితరులు అభినందించారు. తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమాల సందర్భంగా స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలులో విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

యానాం: ప్రతిఒక్కరూ మాతృభాష పట్ల ప్రేమను కలిగి ఉండాలని ప్రముఖ కవి, కలైమామణి దాట్ల దేవదానంరాజు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ అభిజిత్ బెహరా పాల్గొన్నారు.

కాట్రేనికోన: కుంచెనపల్లి ఎంపీపీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం చింతా రాంబాబు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శతక పద్య పోటీల్లో విజేతలైన చిన్నారులకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్.లీలాకుమారి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ముమ్మిడివరం: మంగళవారం స్థానిక డా.రఘుపతి వెంకటరత్నం నాయుడు డిగ్రీ, శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంధం శ్రీరామ్మూర్తి, తెలుగు పండితుడు తోకల వెంకటేశ్వరరావు, గణేశుల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలుగు పండితుడు, టెక్స్ట్ బుక్ రైటర్ చెరుకూరి సూర్యనారాయణశర్మ అన్నారు. మంగళవారం నీలపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఉప్పలగుప్తం: తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులుకు తెలుగువారంతా రుణపడి ఉండాలని ప్రిన్సిపాల్ అడపా గోపి అన్నారు. మండలంలోని భీమనపల్లి ఏవీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అముడా చైర్మన్ గొల్లపల్లికి అపూర్వ స్వాగతం



అముడా చైర్మన్ డేవిడ్ రాజు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌లను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అముడా) చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి డేవిడ్‌రాజుకు ప్రమాణ స్వీకారం సందర్భంగా జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధులు బండార్లంక వద్ద అపూర్వ స్వాగతం పలికారు. కొత్తపేట నుంచి అమలాపురం వరకూ బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. ఈదరపల్లిలో గొల్లపల్లి డేవిడ్‌రాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మంత్రి విశ్వరూప్ కుమారుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్‌లను సత్కరించారు. నక్కా సంపత్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. వేదిక జిల్లా ప్రతినిధులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, సాధనాల వెంకట్రావు, మెండు రమేష్‌బాబు, కోట రామ్మోహన్‌రావుల ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం జరిగింది.

క్రీడల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం



నీలపల్లి హైస్కూల్‌లో క్రీడాకారులను సత్కరిస్తున్న స్కూల్ హెచ్ఎం రాధాకృష్ణ

తాళ్లరేవు: క్రీడల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కె.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి కుడో బాక్సింగ్, కర్రసాము పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మణిదీప్ పుల్లయ్య, శశి గోపి వరుణ్, చైతన్య, శ్రీలక్ష్మిలను సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు.

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్లు తోట రవి, జి.గోవిందరావు, పి.ప్రసాద్‌లు పర్యవేక్షించారు.

కాట్రేనికోన: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు అధ్యక్షతన క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.